# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 190 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 17 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# నిమ్జ్‌లో హ్యుందాయ్ ఆర్ అండ్ డీ కేంద్రం



## 678 ఎకరాల్లో రూ. 8,528 కోట్ల భారీ పెట్టుబడి

## 4,276 ఉద్యోగాల కల్పన

## కార్ల పరిశ్రమకు తెలంగాణ అత్యంత అనుకూలం

## హ్యుందాయ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

కార్ల తయారీ పరిశ్రమ స్థాపించడానికి హైదరాబాద్ అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హ్యుందాయ్ ఇండియా సంస్థకు తెలిపారు. తెలంగాణలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రితో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యోన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది. "భౌగోళికంగా తెలంగాణ దేశంలో మధ్య భాగంలో ఉంది. దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్ కాస్మోపాలిటన్ నగరంగా, అత్యంత సురక్షితమైనదిగా, జీవించేందుకు అత్యంత అనుకూలమైన నగరంగా గుర్తింపు పొందింది" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఇక్కడి సానుకూల పరిస్థితులను వివరించారు. జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ సమగ్ర గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హ్యుందాయ్ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. నిమ్జ్‌లో రూ. 8,528 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న హ్యుందాయ్ కేంద్రం ద్వారా మొత్తం 4,276 ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకుంది. 678 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును దశలవారీగా అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి వివరించింది. రానున్న కొన్ని నెలల్లో ఈ కేంద్రానికి శంకుస్థాపనకు సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. 2024లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు సమావేశాల సందర్భంగా, తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులతో సమావేశమైంది. అనంతరం, 2025 జూన్‌లో హ్యుందాయ్ ప్రతిపాదించిన ప్రతిష్ఠాత్మక ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు మంత్రివర్గ పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక ఉపసంఘం ఆమోదం తెలిపింది. తెలంగాణలో కార్ల తయారీ పరిశ్రమను స్థాపించేందుకు రాష్ట్రం అత్యంత అనుకూలమైన ప్రదేశమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్లు, రహదారి, విమాన, రైలు ..మిగతా 2లో



# రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

### దేశంలో అస్థిరతను సృష్టించేందుకు కాంగ్రెస్ కుట్రలు

### కేంద్ర ప్రభుత్వం పూర్తి కాలం అధికారంలో ఉంటుంది

**హైదరాబాద్, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు.

### వరుసగా మూడోసారి వాయిదా పడ్డ

# ఎథిక్స్ కమిటీ సమావేశం

**హైదరాబాద్, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**



శుక్రవారం జరగాల్సిన ఎథిక్స్ కమిటీ సమావేశం మరోసారి వాయిదా పడింది. దీంతో ఎథిక్స్ కమిటీ వాయిదా పడడం ఇది మూడోసారి. ఈ నెల 8, 13 తేదీల్లో జరగాల్సిన సమావేశం కూడా వాయిదా పడిన సంగతి తెలిసిందే. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అంశంపై ఎథిక్స్ కమిటీ ఏం నిర్ణయం తీసుకోబోతుందని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

**అసలేం జరిగిందంటే..?**

గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో( 2026 మార్చి 26) బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి.. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు, ఆయన వ్యవహరించిన తీరుపై శాసనసభ ఎథిక్స్ కమిటీకి రెఫర్ చేసిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే కడియం శ్రీహరి వైపు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేయి చూపిస్తూ బెదిరించారని, అసభ్య పదజాలంతో దూషించారన్న అభియోగాలను కాంగ్రెస్ సభ్యులు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. సభ హుందాతనాన్ని కాపాడేందుకు ఇలాంటి ఘటనలను తీవ్రంగా పరిగణించాలని కాంగ్రెస్ సభ్యులు కోరారు. భవిష్యత్తులో శాసనసభ సమావేశాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# 17న బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డ్స్ ప్రదానం



**హైదరాబాద్, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

ఈ నెల 17న ఉదయం 11 గంటల నుండి హైదరాబాద్ శిల్పకళా వేదికలో బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డ్స్-2026 వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. శిల్పకళా వేదికలో చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం ఉదయం ఆయన పరిశీలించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ , తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి ముకుంద రెడ్డి, క్రియేటివ్ డైరెక్టర్ కొండ రాజు, టీజీఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు, ఐ అండ్ పీఆర్ అదనపు సంచాలకులు డీఎస్ జగన్, యాంకర్ ఉదయభాను తదితరులు పాల్గొన్నారు. ఈ ఛాలెంజ్ 5 కేటగిరీల్లో ఎంపిక అయిన 35 మంది యంగ్ ఫిల్మ్ మేకర్స్‌కు అవార్డులు ముఖ్య అతిథులు అందజేస్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర ప్రజా ప్రతినిధులు, సినిమా రంగ ప్రముఖులు, తదితరులు హాజరు కానున్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2వ యంగ్ ఇండియా ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్ ఛాలెంజ్-2026లో భాగంగా 5 కేటగిరీల పోటీలలో పాల్గొనేందుకు 2,670 మంది ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

# విదేశాల నుంచి బొగ్గు దిగుమతిపై ఏ విచారణకైనా సిద్ధమే

### యాదాద్రి పవర్ ప్లాంట్ కోసం విదేశీ బొగ్గు కొనుగోళ్లపై కేటీఆర్‌కు రేవంత్ బంపర్ ఆఫర్



**హైదరాబాద్, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

యాదాద్రి పవర్ ప్లాంటు కోసం విదేశాల నుంచి బొగ్గు దిగుమతిపై ఏ విచారణకైనా సిద్ధమేనని సీఎం ప్రకటించారు. ఏ విచారణ కావాలో లేఖ రాసిన కేటీఆరే చెప్పాలన్నారు. యాదాద్రి పవర్ ప్లాంటుకు విదేశీ బొగ్గు దిగుమతికి సంబంధించి 2016లోనే కేసీఆర్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని రేవంత్ ఆరోపించారు. ఇప్పుడు కేటీఆర్ విదేశీ బొగ్గు గురించి లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు.మేం స్వదేశీ బొగ్గుతో నడిపించేందుకు ప్రయత్నాలు చేస్తుంటే, కేటీఆర్ స్పందన మాత్రం భిన్నంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ డిజైన్ ప్రకారం అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు మహానది కోల్‌ఫీల్డ్ వద్ద ఉందని దేశీయంగానే ఈ బొగ్గును తీసుకునేందుకు వీలుగా కేంద్రంతో మాట్లాడామన్నారు. యాదాద్రి పవర్ ప్లాంటులో 50 శాతం దిగుమతి బొగ్గు, మిగతా 50 శాతం సింగరేణిలోని జీ-9 బొగ్గుతో విద్యుత్తు ఉత్పత్తి చేస్తామని నాడు తొలుత ఒప్పందం చేసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 2016 డిసెంబర్ 9న జీ-9 బొగ్గు ..మిగతా 2లో



### పాక్‌లో కూలిన స్కూల్ పైకప్పు..

# 34 మంది చిన్నారుల మృతి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

పాకిస్థాన్‌లోని పెషావర్‌లో ఓ ప్రైవేట్ పాఠశాల పైకప్పు ఒక్కసారిగా కూలిపోవడంతో 34 మంది చిన్నారులతో పాటు ఓ ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయారు. 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పెషావర్ నగరంలో ఉన్న దిర్ కాలనీలో గురువారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. మరణించిన, గాయపడిన చిన్నారులందరూ 13 ఏళ్ల లోపు వారేనని అధికారులు తెలిపారు. శిథిలాల కింద మరికొందరు విద్యార్థులు, పాఠశాల సిబ్బంది చిక్కుకొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మూడు అంతస్తుల భవనంలో పైకప్పును నాణ్యత లేని పద్ధతులతో నిర్మించినట్లు ప్రాథమికంగా గుర్తించామని పోలీసులు తెలిపారు.



### ఎమ్మెల్సీ ఎన్నికల్లోను అభ్యర్థులను

# నిలబెడుతున్నాం : కవిత

### ఖైరతాబాద్ ఎన్నికలో టిఆర్ఎస్ అభ్యర్థి

**హైదరాబాద్, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు.

# వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

**ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి వనరుల సంరక్షణకు జలమండలి కార్యాచరణ**

**నవంబర్ 1 నుంచి డయల్ -ఏ-గ్రీన్ టాంకర్ సరఫరాకు సన్నాహాలు**

**నిర్మాణ రంగం, పరిశ్రమల్లో తాగునీటికి ప్రత్యామ్నాయంగా శుద్ధి చేసిన నీటి వినియోగానికి ప్రాధాన్యం**

**తొలి దశలో రోజుకు 100 ఎంఎల్‌డీ శుద్ధి చేసిన నీటి వినియోగం లక్ష్యం**

**గ్రీన్ వాటర్ ట్యాంకర్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా బుకింగ్, సరఫరా, ట్రాకింగ్ సదుపాయాలు**

**ప్రైవేట్ ఎస్టీపీల్లో మిగులు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు**

**జలమండలికి పూర్తి సహకారం అందిస్తామన్న క్రెడాయ్, టీబీఎఫ్, నెరెడ్కో నిర్మాణ రంగ సంస్థల ప్రతినిధులు**

**ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిర్మాణ రంగ సంస్థలతో జలమండలి ప్రత్యేక సమావేశం**

**హైదరాబాద్, అక్టోబర్ 16(ప్రభాత ఉదయం)**



ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు, సింగూరు--మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలపై పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలో రానున్న వేసవిలో హైదరాబాద్ నగరానికి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు జలమండలి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా నిర్మాణ రంగం, పరిశ్రమలు, ఇతర తాగునీరు అవసరం లేని పనులకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించేలా ప్రోత్సహించేందుకు శుక్రవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఐఏఎస్ ఆధ్వర్యంలో క్రెడాయ్, నరెడ్కో, టీబీఎఫ్ తదితర నిర్మాణ రంగ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

రానున్న ఎనిమిది నెలల పాటు తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించడం, భూగర్భజలాల వినియోగాన్ని నియంత్రించడం, ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని నిర్మాణ రంగ అవసరాలకు మళ్లించడం, ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా జలమండలి చేపడుతున్న నీటి సంరక్షణ చర్యలకు పూర్తి సహకారం అందిస్తామని నిర్మాణ రంగ సంస్థల ప్రతినిధులు తెలిపారు.

**నవంబర్ 1 నుంచి డయల్ -ఏ-గ్రీన్ టాంకర్:**

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తదుపరి వర్షాకాలం ప్రారంభమయ్యే వరకు ఎనిమిది నెలల కాలం అత్యంత కీలకమని ఎండీ అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమయంలో తాగునీటి వనరులపై అనవసర ఒత్తిడి పడకుండా నీటి వినియోగాన్ని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా నిర్మాణ పనులు, పరిశ్రమలు, పార్కులు, గ్రీన్‌బెల్టులు, ల్యాండ్‌స్కేపింగ్ వంటి అవసరాలకు సాధ్యమైనంత మేరకు శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

శుద్ధి చేసిన నీటి లభ్యత, నాణ్యతా ప్రమాణాలు, రవాణా సదుపాయాలు, సరఫరా సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని అమలు విధానాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలు, విధివిధానాలను ఖరారు చేసి త్వరలో ఉత్తర్వులు జారీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. నవంబర్ 1 నుంచి ఈ కార్యాచరణను ప్రారంభించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిర్మాణ రంగ సంఘాలు తమ సభ్యులతో సంప్రదింపులు జరిపి, భూగర్భజలాలు, తాగునీటికి ప్రత్యామ్నాయంగా శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా అవగాహన కల్పించాలని కోరారు. నిర్మాణ అవసరాలకు సరఫరా చేసే శుద్ధి చేసిన నీరు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించే సరఫరాదారులపై చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

**గ్రీన్ వాటర్ ట్యాంకర్ డిజిటల్ ప్లాట్‌ఫామ్:**

శుద్ధి చేసిన నీటిని అవసరమైన వినియోగదారులకు సులభంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రత్యేకంగా గ్రీన్ వాటర్ ట్యాంకర్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి చేస్తున్నట్లు ఎండీ తెలిపారు. ఇందులో నీటి సరఫరాదారులు, ట్యాంకర్ నిర్వాహకులు, నిర్మాణ సంస్థలు, పరిశ్రమలు, ఇతర వినియోగదారులు నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. వినియోగదారుల అవసరాలు, సమీపంలోని ఎస్టీపీల్లో అందుబాటులో ఉన్న శుద్ధి చేసిన నీటి పరిమాణం, సరఫరా దూరం, ట్యాంకర్ల లభ్యత వంటి అంశాలను అనుసంధానించి సమర్థవంతమైన సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో ట్యాంకర్లను బుక్ చేసుకోవడంతో పాటు వాటి కదలికలను ట్రాక్ చేసుకునే సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను వారం నుంచి పది రోజుల్లో సిద్ధం చేయాలనే లక్ష్యంతో సాంకేతిక ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు. దీని ద్వారా శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు సరఫరా వ్యవస్థలో పారదర్శకత, సమన్వయం పెరుగుతాయని పేర్కొన్నారు.

**ప్రైవేట్ ఎస్టీపీల్లో మిగులు నీటికి సద్వినియోగం:**

నగరంలోని గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ సముదాయాలు, ఇతర ప్రైవేట్ సంస్థల పరిధిలో ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రాలను కూడా ఈ కార్యాచరణలో భాగస్వామ్యం చేయాలని జలమండలి నిర్ణయించింది. ఆయా ఎస్టీపీల శుద్ధి సామర్థ్యం, రోజువారీ నీటి ఉత్పత్తి, అంతర్గత వినియోగం, మిగులు నీటి లభ్యతకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు ఎండీ తెలిపారు. ఇప్పటివరకు 51 ప్రైవేట్ ఎస్టీపీలు నమోదు చేసుకున్నాయని, వాటి నుంచి రోజుకు సుమారు 1.5 ఎంఎల్‌డీ మిగులు శుద్ధి చేసిన నీరు అందుబాటులో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని వివరించారు. ఈ నీటిని వృథాగా వదిలేయకుండా సమీపంలోని నిర్మాణ ప్రాజెక్టులు, పార్కులు, ల్యాండ్‌స్కేపింగ్ తదితర అవసరాలకు వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

అవసరమైన మౌలిక సదుపాయాలు, నాణ్యతా ప్రమాణాలు అందుబాటులో ఉన్న ప్రైవేట్ ఎస్టీపీలను తాత్కాలిక నీటి ఫిల్లింగ్ కేంద్రాలుగా వినియోగించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల శుద్ధి చేసిన నీటి లభ్యత పెరగడంతో పాటు ట్యాంకర్ల ప్రయాణ దూరం, రవాణా వ్యయాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు.

**తొలి దశలో రోజుకు 100 ఎంఎల్‌డీ లక్ష్యం:**

నిర్మాణ రంగం, పరిశ్రమలు, పార్కులు, ల్యాండ్‌స్కేపింగ్ తదితర అవసరాలకు శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని పెంచే దిశగా తొలి దశలో రోజుకు 100 ఎంఎల్‌డీ వినియోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమావేశంలో వివరించారు. ఈ లక్ష్య సాధనకు అవసరమైన సరఫరా వ్యవస్థలు, ఫిల్లింగ్ కేంద్రాలు, రవాణా సదుపాయాలు, పైప్‌లైన్ అనుసంధానాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఎస్టీపీల నుంచి సమీపంలోని వినియోగ ప్రాంతాలకు నేరుగా పైప్‌లైన్లు ఏర్పాటు చేయడం ద్వారా ట్యాంకర్లపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు రవాణా వ్యయాన్ని కూడా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, గోల్ఫ్ కోర్సులు, పార్కులు, నిర్మాణ ప్రాజెక్టులు, ఇతర భారీ వినియోగ ప్రాంతాలను సమీపంలోని ఎస్టీపీలతో అనుసంధానించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

బొటానికల్ గార్డెన్‌కు ఇప్పటికే ఎస్టీపీ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసిన అంశాన్ని ప్రస్తావిస్తూ, సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఇటువంటి నమూనాలను ఇతర ప్రాంతాలకు విస్తరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

**సరఫరా వ్యయం తగ్గింపుపై ప్రత్యేక దృష్టి:**

శుద్ధి చేసిన నీటి ధర తక్కువగా ఉన్నప్పటికీ, ఎస్టీపీల నుంచి వినియోగ ప్రాంతాలకు ఎక్కువ దూరం రవాణా చేయాల్సి రావడంతో ట్యాంకర్ ఖర్చులు పెరుగుతున్న అంశంపై సమావేశంలో చర్చించారు. శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని విస్తృతం చేయాలంటే సరఫరా వ్యవస్థ వినియోగదారులకు ఆర్థికంగా కూడా అనుకూలంగా ఉండాలని ఎండీ పేర్కొన్నారు.

నీటి పరిమాణం, రవాణా దూరం, ట్యాంకర్ సామర్థ్యం, సరఫరా వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సముచిత ధరల విధానాన్ని రూపొందించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సమీపంలోని ఎస్టీపీల నుంచి నీటిని సరఫరా చేయడం ద్వారా వ్యయాన్ని తగ్గించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

అలాగే జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర సంబంధిత సంస్థల పరిధిలోని పార్కులు, రహదారుల మధ్యలోని పచ్చదనం, గ్రీన్‌బెల్టులు, ల్యాండ్‌స్కేపింగ్ అవసరాలకు సాధ్యమైనంత మేరకు శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా విభాగాల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు.

**నిర్మాణ రంగ సంఘాల భాగస్వామ్యంతో తదుపరి కార్యాచరణ:**

శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని పెంచేందుకు నిర్మాణ రంగ సంస్థల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఎండీ అశోక్ రెడ్డి పేర్కొన్నారు. క్రెడాయ్, ఇతర నిర్మాణ రంగ సంఘాలు తమ సభ్యులతో చర్చించి రోజువారీ నీటి అవసరాలు, సరఫరాకు సంబంధించిన ఇబ్బందులు, నాణ్యతాపరమైన సందేహాలు, సాంకేతిక అంశాలను గుర్తించి జలమండలి దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఈ అంశాలపై మరోసారి సమావేశం నిర్వహించి శుద్ధి చేసిన నీటి లభ్యత, సరఫరా విధానం, నాణ్యతా ప్రమాణాలు, ధరల విధానం, అమలు ప్రక్రియపై స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆచరణ సాధ్యమైన విధానాన్ని రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

**నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి:**

రానున్న వేసవిలో నీటి అవసరాలను సమర్థంగా ఎదుర్కోవాలంటే జలమండలి చేపట్టే చర్యలతో పాటు ప్రజలు, నిర్మాణ రంగ సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, నివాస సంఘాలు సమష్టిగా సహకరించాలని ఎండీ అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. తాగునీటిని అత్యవసరమైన గృహ, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగిస్తూ, ఇతర అనువైన అవసరాలకు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేసిన నీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. నీటి వృథాను అరికట్టడం, అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించడం, ప్రత్యామ్నాయ నీటి వనరులను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో నీటి భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాటు జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్, డైరెక్టర్లు నారాయణ, ప్రభు, సీజీఎంలు పద్మజ, సుజాత, క్రెడాయ్ అధ్యక్షులు జయదీప్ రెడ్డి, నరెడ్కో ఉపాధ్యక్షులు అశోక్ స్వామినాథన్, టీబీఎఫ్ ప్రతినిధి ప్రభాకర్ రావులతో పాటు ఇతర అధికారులు, నిర్మాణ రంగ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిమ్జ్‌లో హ్యుందాయ్ ఆర్ అండ్ డీ కేంద్రం



మొదటి పేజీ తరువాయి...

మార్గాల ద్వారా బలమైన రవాణా మౌలిక సదుపాయాలు, భవిష్యత్తులో ఓడరేవులతో హైస్పీడ్ రవాణా అనుసంధానాన్ని అభివృద్ధి చేసే ప్రణాళికలు రాష్ట్రానికి మరింతగా అనుకూలంగా మారుతాయని వివరించారు. తయారీ రంగం అభివృద్ధి కోసం పెరి-అర్బన్ రీజియన్ వంటి ప్రణాళికాబద్ధమైన ప్రాంతీయ అభివృద్ధి నమూనాల ద్వారా తెలంగాణ వేగవంతమైన పారిశ్రామిక విస్తరణకు సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలన్న ప్రభుత్వ దార్శనికతను ముఖ్యమంత్రి వివరించారు. 2026లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా హ్యుందాయ్ నాయకత్వ బృందాన్ని ఆహ్వానించారు.

మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ చాంగ్యోన్ చో మాట్లాడుతూ, "తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో మా భాగస్వామ్యాన్ని కొనసాగిస్తాం" అని తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ మోటార్స్ ఇప్పటికే హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు సంబంధించిన పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా సేవలందిస్తోంది. హ్యుందాయ్ ఇండియా ఇంజినీరింగ్ సామర్థ్యాలను మరింత విస్తరించే క్రమంలో, జహీరాబాద్ నిమ్జ్‌లో ఏర్పాటు చేయనున్న ఆర్ అండ్ డీ కేంద్రం, భారీ వాహన పరీక్షా కేంద్రం వాహనాల పరీక్షలు, పనితీరు ధ్రువీకరణ, ఇంజినీరింగ్ ప్రక్రియల మెరుగుదలలో కీలక పాత్ర పోషించనుంది.

ఈ సమావేశంలో సీఎం సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విదేశాల నుంచి బొగ్గు దిగుమతిపై ఏ విచారణకైనా సిద్ధమే

మొదటి పేజీ తరువాయి...

50 శాతం, మిగతా 50 శాతం బొగ్గు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. ఈ బొగ్గు కోసం సింగరేణి, ఎంఎస్‌టీసీ ఒప్పందం జరుగుతున్నపుడు వీటి వెనక ఒక బూచోడు దాక్కున్నారని, అప్పట్లోనే ఒప్పందం జరిగితే ఇప్పుడు విదేశీ బొగ్గు కొంటున్నారని కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. విదేశాల నుంచి బొగ్గు దిగుమతికి ప్రత్యేక లైన్ కావాలని అప్పట్లోనే కేంద్రానికి లేఖ రాశారని గుర్తు సీఎం చేశారు. పోర్టు ప్రైవేటుది, బొగ్గు విదేశాలది. ఈ విదేశీ బొగ్గు వెనక ఉన్న ప్రతిభావంతుడు, ముసుగు వీరుడెవరని సీఎం నిలదీశారు. నష్టాల్లోని మీ వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి షేర్లు కొన్నదెవరు? అప్పటి ఒప్పందాలు నిజం కావా? ఈ పెట్టుబడులు నిజం కావా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

**రూ.లక్ష కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం**

దామరచర్ల వద్ద పవర్ ప్లాంటు కట్టాలన్న కేసీఆర్ అనాలోచిత నిర్ణయం కారణంగా రానున్న 50 ఏళ్లలో తెలంగాణకు దాదాపు రూ.లక్ష కోట్ల నష్టం వాటిల్లుతుందని సీఎం తెలిపారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్రానికి విద్యుత్తు డిమాండ్ అధికంగా ఉన్నందున అత్యవసరంగా సరఫరా చేసేందుకు నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని కోరామన్నారు. మంత్రి మండలి ఉపసంఘం రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుని సోమవారానికి బొగ్గు అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితోనూ మాట్లాడానని, దేశీయ బొగ్గును యాదాద్రిలో వాడేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. "ఈరోజు కూడా సింగరేణిలో బొగ్గు లేదు. కష్టకాలంలో విద్యుత్ ఉత్పత్తి చేయాలంటే బొగ్గు కొరత ఉంది. దీంతో నైనీ కోల్ వాళ్లతో మాట్లాడాం. అక్కడి వారు వ్యతిరేకించడంతో కేంద్రంతో చర్చించి వారిని ఒప్పించేలా చేశాం. అది కూడా గ్రేడ్ -12, 13 బొగ్గు రోజుకు 3 ర్యాకుల వరకు బొగ్గు వస్తోంది. దీంతో విద్యుత్ ఉత్పత్తి మొదలుపెట్టాం. ఇది సరిపోవడం లేదని మహానది కోల్ ఫీల్డ్‌తో మాట్లాడాం. విద్యుత్ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని వీటిని సోమవారంలోగా అందించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తోంది" - సీఎం రేవంత్‌రెడ్డి



## నూతన వధూవరులను ఆశీర్వదించిన సీనియర్ నాయకులు మూల మల్ల భీం రెడ్డి

**కొత్తకోట, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం విలియం కొండ జేవియర్ ఫంక్షన్ హాల్ లో పెబ్బేరు మండలం వైశాఖపూర్ గ్రామం ప్రగతి విద్యాలయం కరస్పొండెట్ లక్ష్మీ,బీంసాగర్ దంపతుల కుమార్తె ప్రగతి వివాహ ,పవన్ తో జరిగింది. ఈ వివాహ వేడుకల్లో వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు మూలమల్ల భీంమ్ రెడ్డి నవ వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.






## రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం) నగరంలోని బుద్ధ భవనంలో గల రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళ కమిషన్ సభ్యులు బతుకమ్మ ఆడి , పాడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు.



జలమండలి సిజిఎం (రెవెన్యూ) కార్యాలయంలో దుర్గాష్టమి వేడుకల్లో అమ్మవారికి పూజలు చేస్తున్న సంస్థ ఈ డి మందల సంతోష్



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది.

## జలమండలి సిజిఎం (రెవెన్యూ) కార్యాలయంలో ఘనంగా దుర్గాష్టమి వేడుకలు

**ఖైరతాబాద్, అక్టోబర్ 16(ప్రభాత ఉదయం)**

ఖైరతాబాద్ లోని జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ (రెవెన్యూ) కార్యాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శుక్రవారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో జలమండలి ఈడి, డైరెక్టర్ (రెవిన్యూ) మండల సంతోష్, డైరెక్టర్ ఎం ప్రభు, జిఎం బలరామరాజు, డీజీఎం ఉత్తమ్ కుమార్, మౌనిక, మేనేజర్ సంపత్, మహిళా ఉద్యోగులు భవాని, శిరీష, ఉష, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఘనంగా శ్రీ దేవి శరన్నవరాత్రులు



కాటేదాన్ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవాలయంలో సరస్వతి దేవి అమ్మ వారి అలంకరణలో కొలువు దీరిన అమ్మ వారికి పూజలు చేస్తున్న భక్తులు



బాబుల్ రెడ్డి నగర్ లో దేవి దసరా శరన్నవ రాత్రి వేడుకలలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



బుద్వేల్ లోని సీపీఐ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ సంబరాలు



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వద్ద బతుకమ్మ సంబరాలు

**రాజేంద్రనగర్, అక్టోబరు 16 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల లో శుక్రవారం శ్రీ దేవి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. బతుకమ్మ సంబరాలు, అమ్మవారికి పూజలు, అన్న ప్రసాద కార్యక్రమాలతో బస్తీలు పండుగ శోభను సంతరించుకున్నాయి. వందల సంఖ్యలో భక్తులు పూజలలో పాల్గొంటున్నారు.



అత్తాపూర్ లో వాహనాల తనిఖీ లో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ వీ సీ సజ్జనార్, ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య

## అత్తాపూర్‌లో ఆపరేషన్ కవచ్‌లో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ వీ సీ సజ్జనార్

**బుద్వేల్, అక్టోబరు 16 (ప్రభాత ఉదయం)**

ఆపరేషన్ కవచ్ లో భాగంగా నగర పోలీస్ కమిషనర్ వీ సీ సజ్జనార్ గురువారం రాత్రి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకుని అవగాహన కల్పించారు. పాత బస్తీ లోని పలు ప్రాంతాలలో సైతం ఆపరేషన్ కవచ్ కార్యక్రమం నిర్వహించారు.



పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్ వే పై ఒకదాని కొకటి ఢీ కొట్టు కున్న వాహనాలు

## పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై వరుస ప్రమాదాలు.. ఐదు కార్లు ఢీ

**బుద్వేల్, అక్టోబరు 16 (ప్రభాత ఉదయం) :**

పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పై మెహిదీ పట్నం నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే మార్గంలో పిల్లర్ నంబర్ 131 సమీపంలో వరుస ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు ఓ కారు డివైడర్ పై ఉన్న స్తంభాన్ని ఢీకొట్టగా, దాని వెనుక వస్తున్న మరో నాలుగు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో మొత్తం ఐదు కార్లు ప్రమాదానికి గురయ్యాయి. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుల మొబైల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను తొలగించే చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని అధికారులు సూచించారు.



## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### ఘనంగా కుంకుమ్మ అర్చన, చండిహోమం వేడుకలు

**రాజేంద్రనగర్ అక్టోబరు 16(ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. బుద్వేల్ రైల్వే స్టేషన్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారు ఐదో రోజు లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొలువుదీరిన లలిత త్రిపుర సుందరి దేవి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అమ్మవారిని దర్శనించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా అమావారి మండల దగ్గర కుంకుమ్మ అర్చన ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండటంతో భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొంది.ఈ కార్యక్రమంలో బస్తి వాసులు మాధవ రెడ్డి, సుధాకర్ గౌడ్,శ్రీను,రంగయ్య, సత్తయ్య, అనంత్ రెడ్డి, జంగయ్య, హన్మంత్,చిరంజీవి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా మహా చండిహోమం**

బుద్వేల్ రైల్వే స్టేషన్ కమ్యూనిటి హల్ లో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రాంగణంలో ఆరో రోజు వేదపండితుల ఆధ్వర్యంలో మహాచండి హోమం ఘనంగా నిర్వహించారు.పలువురు దంపతులు హోమంలో కుర్చీని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం పూల అనుసూజ - సత్తయ్య ముదిరాజ్ జ్ఞాపకార్థంగా పూల పూల లావణ్య -వెంకటేష్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బస్తి పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.





పూజలలో పాల్గొన్న సురేష్ దంపతులు

## శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

### బుద్వేల్‌లో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సురేష్ దంపతులు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 16(ప్రభాత ఉదయం)**

బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.6 వ రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సురేష్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ మహాలక్ష్మీదేవి ఆశీస్సులతో అందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.




## రబీలో ఆరుతడి పంటలే సాగు చేయాలి

### విబిజి రాంజీలో జల సంరక్షణ పనులకు ప్రాధాన్యతనివ్వాలి.
### ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి.
### ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్ లు లేని పిల్లలకు ప్రత్యేక డ్రైవ్.
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16(ప్రభాత ఉదయం):**

ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున రబీ సీజన్ లో రైతులు తమ బోరు, బావుల్లో నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వెబ్ ఎక్స్ ద్వారా జిల్లా కలెక్టర్ పలువురు అధికారులతో కలెక్టర్ సమావేశమై వివిధ అంశాలపై మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే పనులు పూర్తయ్యేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ప్రతినిత్యం తన పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎక్కడైనా పంటలు ఎండిపోతే పూర్తిస్థాయి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుందన్నారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విబిజి రాంజీలో జల సంరక్షణ పనులకు ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. పంట కుంటలు, ఇంకుడు గుంతలు పెద్ద ఎత్తున నిర్మించాలని ఆదేశించారు. ఆయా గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన పనులపై సర్పంచులు, సంబంధిత అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించుకొని ప్రాధాన్యత క్రమంలో ఆయా పనులను చేపట్టాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీలలో చేపట్టిన పనులపై ఈనెల 30వ తేదీలోగా నివేదిక పంపాలని ఆదేశించారు. ఎల్ నినో నేపథ్యంలో రైతు కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులు కల్పించాలని సూచించారు. క్షేత్ర సహాయకుల మూమెంట్ రిజిస్టర్ ను ఎంపీడీవోలు ప్రతి నెల తమకు పంపాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం కావాలి.**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం అయ్యేలా సంబంధిత మండలాల ఎంపీడీవోలు, ఇతర అధికారులు తరచు పర్యవేక్షణ చేస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడ తాగు నీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట బోర్ వెల్స్ రీఛార్జ్, మోటార్ల రిపేర్, తదితర పనులను చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వం గొర్రెలు, మేకలకు బీమా పథకాన్ని వర్తింపచేస్తున్నందున పాడి రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణతై మూడేళ్లు పూర్తయిన వారు గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా దరఖాస్తు చేసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్స్ లేని పిల్లలకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఎన్రోల్మెంట్ చేయించాలని ఆదేశించారు. ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినందున ప్రతి శుక్రవారం విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని, ఎక్కడ కూడా ఫుడ్ పాయిజన్ కేసులు కాకుండా పర్యవేక్షించాలన్నారు. చైల్డ్ సేఫ్టీ ఉపాధ్యాయులను కూడా నియమించామని, ఆయా గురుకులాలు, కేజీబీవీలు, వసతిగృహాల విద్యార్థుల సంరక్షణకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శిలు ప్రతి మంగళవారం తమ పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. రీ సర్వే పనులను వేగవంతం చేయాలని, లైసెన్స్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అలసత్వం వహించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపట్టిన అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మంజుల, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు గగన్ పహాడ్, హిమాయత్ సాగర్‌లలో

# విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండే ప్రాంతాలు

రాజేంద్రనగర్ /బండ్లగూడ, అక్టోబర్ 16(ప్రభాత ఉదయం) హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్

వై. రమేష్ కుమార్ తెలిపారు. ఈ సెక్షన్ పరిధిలో కొత్త విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఛార్జింగ్, నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 10:30 గంటల నుండి. నుండి 11:00 గంటల వరకు

కాళీ మందిర్ ఫీడర్ పరిధిలో సింధు లోయ, సంజ్ఞ గాంధీ నగర్, భవానీ కాలనీ, బైరాగిగూడ, శివ సాయి నగర్, సుబ్రహ్మణ్య కాలనీ, రంగా రెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకోని, గంధంగూడ గృహాలు,

12:00 గంటల నుండి. నుండి 12:30 గం వరకు

**హైదర్‌షాకోట్ ఫీడర్**

ప్రభావిత ప్రాంతాలు వెంకటేశ్వరావు కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రస్తా నగర్, తిరుమల గార్డెన్, రాధ రీటప్స్ ఫేజ్-××, పావని హార్మొనీ విల్లాస్, సాయి శక్తి అపార్ట్‌మెంట్స్, హెచ్ఆర్, 12:00 గంటల నుండి. నుండి 12:30 గం వరకు మాధవి నగర్ ఫీడర్ కేంద్రీయ విహార్, రాజ బస్తీ, హైదర్‌షాకోట్ గ్రామం, మాధవి నగర్, శ్రీ రామ్ నగర్, బృందావన్ కాలనీ,

16:00 గంటల నుండి. 16:30 గంటల వరకు స్నేహిత హిల్స్ ఫీడర్ పరిధిలో స్నేహిత హిల్స్ ఫేజ్-అ , ఫేజ్-××,



బ్రాడ్‌వేరీ

హోటల్, స్టోనేజ్ అపార్ట్‌మెంట్స్, ఇండియన్ స్కూల్, రాయల్ ఓక్ ఫర్నిచర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరానిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

**గగన్ పహాడ్ లో...**

గగన్‌పహాడ్ సెక్షన్‌లో విద్యుత్ సామర్థ్య తనిఖీ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని

సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి హర్షవర్ధన్ తెలిపారు.ఇందిరా గాంధీ సొసైటీ) సబ్-స్టేషన్ పరిధిలో

మధ్యాహ్నం 12:00 గంటల నుండి 12:30 గంటల వరకు హౌసింగ్ సొసైటీ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన వెంకటేశ్వర కాలనీ, శ్రీరామ్‌నగర్, లంబాడి బస్తీ ఉ పారిశ్రామిక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ: సి ఈ ఎల్ గోపయ్య





బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్న టీజీఎస్పీడీసీఎల్ ఆర్ ఆర్ జోన్ సీఈ గోపయ్య.. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎస్ ఈ చంద్రశేఖర్ .. బతుకమ్మ ఆడుతున్న మహిళా అధికారులు, ఉద్యోగులు,సిబ్బంది

**బతుకమ్మ వేడుకలు మహిళల కు పెద్ద పండుగ: టీజీఎస్పీడీసీఎల్ మహిళా ఉద్యోగ సంఘం నేత తులసి నాగ రాణి**

**విద్యుత్ రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిల్ కార్యాలయాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు**

**బతుకమ్మ ఆట, పాట లు ఆడి పాడిన మహిళ అధికారులు నాగ తులసి, విజయలత, నాగమణి, మంజుల లు**

**మెహదీపట్నం, అక్టోబర్16(ప్రభాత ఉదయం)**

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని టీజీఎస్పీడీసీఎల్ ఆర్ జోన్ సీఈ ఎల్ గోపయ్య అన్నారు. శుక్రవారం మెహదీపట్నం నానల్ నగర్ చౌరస్తాలోని విద్యుత్ సైబర్ సిటీ, రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయాల్లో బతుకమ్మ వేడుకలు మహిళ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సి గోపయ్య మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేసే విధంగా ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ బతుకమ్మ వేడుకల్లో రాజేంద్రనగర్, సైబర్ సిటీ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ లు ఎస్ రవిప్రసాద్, చంద్రశేఖర్, ఆర్ఆర్ జోన్ జీఎం అంజయ్య, ఎస్ ఏ ఓ లు ఎంపీ రవికుమార్, రవీందర్, డివిజనల్ ఇంజనీర్లు (టెక్నికల్) ఎం శివశంకర్, రాంబాబు సైబర్ సిటీ సర్కిల్ అకౌంట్ ఆఫీసర్ (వ్యయం) మురళీ గౌడ్, రాజేంద్రనగర్ సర్కిల్ అకౌంట్ ఆఫీసర్ (వ్యయం) విజయలత,సైబర్‌సిటీ ఏడీఈ(వాణిజ్యం) ఎం చరణ్, రాజేంద్రనగర్ సర్కిల్ ఏఓ(రెవెన్యూ) సైబర్ సిటీ సర్కిల్ ఏవో (రెవెన్యూ)నాగేశ్వర రెడ్డి,,సైబర్‌సిటీ, రాజేంద్రనగర్ సర్కిల్‌లోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.





# రూ.6.11 కోట్ల నగదుతో ధనలక్ష్మిగా వాసవి మాత

**వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు**

**శ్రీ కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి**

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16(ప్రభాత ఉదయం):**

గద్వాల పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం అమ్మవారు రూ.6.11 కోట్ల నగదుతో ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆలూరు బిలకంటి రాములు ఆధ్వర్యంలో చేపట్టిన నగదు అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రతి ఏటా నవరాత్రుల్లో శుక్రవారం అమ్మవారిని కోట్లాది రూపాయల నగదుతో అలంకరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండ్ల జ్యోతి మాట్లాడుతూ... ప్రతి ఏటా కోట్లాది రూపాయలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నరహరి శ్రీనివాసులు, కోశాధికారి పత్తి రత్నాకర్, యువజన సంఘం అధ్యక్షుడు బాదం జగదీష్, కార్యదర్శి వినోద్, కోశాధికారి కొండా రాఘవేంద్ర, వజ్రాల రాజేష్, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ నరహరి హనుమంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## దుర్గ మాత చల్లని చూపు ప్రజలందరికీ ఉండాలి

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్**

**కూకట్ పల్లి, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ కాలనీలో నిర్వహించినటువంటి దుర్గామాత నవరాత్రుల్లో భాగంగా దుర్గామాతను కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష శుక్రవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారిని కొలిచే ప్రతి ఒక్కరికి అమ్మ అండగా ఉంటుందని, అదేవిధంగా మొగులమ్మ కాలనీలో దేవీ నవరాత్రు లో భరతనాట్యం, కూచిపూడి లాంటి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి దేవి భక్తి చాటుకోవడం మంచి పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమానికి నన్ను విశిష్ట అతిథిగా ఆహ్వానించినా దుర్గాదేవి కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవాని మాతలతో పాటు మహిళలు, యువకులు, కాలనీ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## జనసేన పార్టీలోకి గాయత్రి నగర్ డివిజన్ నాయకులు చేరిక!

**పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించిన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్**

**కూకట్ పల్లి, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ లో జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, జాయినింగ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, జనసేన పార్టీ ఆశయాలు సిద్ధాంతాలు నచ్చి కూకట్ పల్లి నియోజకవర్గం గాయత్రి నగర్ డివిజన్ కి చెందిన తుంగం శ్రీనివాసరావు, పొట్నూరు శ్రీనివాసరావు జనసేన పార్టీలో చేరారు.వారిని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీ విధి-విధానాలపై విశ్వాసం వ్యక్తం చేస్తూ పార్టీ కండువా కప్పుకున్న నూతన సభ్యులకు నియోజకవర్గం లో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని, జనసేన సైనికులుగా ప్రజా సేవలో అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, జాయినింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.








### గద్వాలలో మారిన వాతావరణం.. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో

# భారీ వర్షం, ఉపశమనం పొందిన ప్రజలు!

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16(ప్రభాత ఉదయం):**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురుగాలులు, గాలిదుమారంతో గద్వాల పట్టణంలో భీభత్సాన్ని సృష్టించాయి. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.

గత కొన్ని రోజులుగా ఉక్కపోత మరియు ఎండ వేడిమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ఈ సడన్ వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఎంతో ఉపశమనం పొందారు. వర్షాన్నికి రోడ్లు జలమయ్యాయి.



## శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి: ఎస్ ఐ

**రాజేంద్రనగర్, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని మైలార్ దేవుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ అన్నారు. అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని లక్ష్మి గూడ లోని రాజీవ్ గృహకల్ప భవన సముదాయంలో మహిళా నాయకురాలు బి లలితారెడ్డి, శరణమ్మ పుష్పమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి వేడుకల్లో ఆయన పాల్గొని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు అపరిచిత వ్యక్తులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు ఘనంగా పూజలు

**చిన్నపిల్లలకు నోటుబుక్కులు పంపిణీ చేసిన సాధుప్రతాప్ రెడ్డి**

**కూకట్ పల్లి, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గ బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోశ్రీ దేవి శరన్నవరాత్రి 6వ రోజు సరస్వతి మత అవతారంలో అమ్మ వారు భక్తులకి దర్శనమించారు. ఆలయ కమిటీ చైర్మన్ సాధు ప్రతాప్ రెడ్డి సరస్వతీ దేవి సందర్భంగా చిన్న పిల్లలకు నోట్ బుక్స్, పెన్స్ సరస్వతీ మాత పూజ లో ఉంచి పిల్లలందరికీ అందజేశారు. అనంతరం సాధు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ హిందూ మతం లోని ముఖ్యమైన దేవతా మూర్తులలో సరస్వతి దేవి చదువుల తల్లిగా ఆరాధించబడుతుంది. ఈ దేవి త్రిమూర్తులలో ఒకరైన బ్రహ్మ దేవేరి, వేదాలు, పురాణాలలో విపులంగా సరస్వతీ నది కూడా ప్రస్తావించబడిందని అన్నారు. కొన్ని పురాణ గాథలు సరస్వతీ దేవి, సరస్వతీ నది చరిత్రలను అనుసంధానిస్తాయని, నవరాత్రి, వసంత పంచమి ఉత్సవాలలో సరస్వతీదేవి ఆరాధన ప్రముఖంగా జరుగుతుందని అన్నారు.



## దేవీ నవరాత్రులు ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలి

**నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్**

**కూకట్‌పల్లి, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భరత్ నగర్ కాలనీలో నాగిరెడ్డి ఆహ్వానం మేరకు, మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్డులో తూము మనోజ్ ఆహ్వానం మేరకు, బాలాజీ నగర్‌లో కృష్ణ రాజ్‌పుత్ ఆహ్వానం మేరకు నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, ఐకమత్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భక్తులు, మహిళా నాయకురాళ్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధనలక్ష్మి అలంకారంలో శ్రీతాయమ్మ అమ్మవారు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం):**



దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గద్వాల పట్టణంలోని రెండవ వార్డులోగల శ్రీశ్రీశ్రీ శక్తి స్వరూపిణి తాయమ్మ దేవాలయంలో అమ్మవారిని శుక్రవారం ధనలక్ష్మి అలంకారం గావించారు. రూ. 1.50 కోటి విలువైన కరెన్సీ నోట్లతో విశేష అలంకారం చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# వీరేష్ కుటుంబానికి న్యాయం చేయాలి

**పోలీసుల పాత్రపై సమగ్ర విచారణ జరపాలి**

**పోలీసులకు, టీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట**

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16(ప్రభాత ఉదయం):**






ధరూర్ మండలం బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురువ వీరేష్(28) మృతిపై సమగ్ర విచారణ జరిపి, వీరేష్ మరణానికి బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని తెలంగాణ రక్షణ సేన గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

**గద్వాల జిల్లా ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత.. రోడ్డుపై మృతదేహంతో టీఆర్ఎస్ నాయకుల ధర్నా!**

ధరూర్ మండలం బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వీరేష్ ను ధరూర్ పోలీసులు దాడి చేసి, అవమానించారంటూ మనస్తాపం చెందిన వీరేష్ ఈ నెల 9న పురుగుల మందు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడారు. ఈ క్రమంలో కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని కర్నూల్ నుంచి గద్వాల జిల్లా ఆసుపత్రి వద్దకు ఆంబులెన్స్ తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి నిరసన తెలిపేందుకు టీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, టీఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పట్టువీడని నాయకులు చివరకు మృతదేహాన్ని రోడ్డుపైనే ఉంచి బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.... న్యాయం కోసం ధరూర్ పోలీస్ స్టేషన్ కు వెళ్ళిన వీరేష్ ను విచారణ పేరుతో పోలీసులు స్టేషన్ కు పిలిపించి దాడి చేసి అవమాన పరచడంతో మనస్థాపం చెంది అవమానం భరించలేక నిషేధిత మందు సేవించి ఆత్మహత్యయత్నం చేసుకుని మృతి చెందిన వీరేష్ మరణానికి దారితీసిన పరిస్థితులను వెలికితీసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు పలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. వీరేష్ మరణానికి ముందు పోలీసుల వేధింపులు ఎదురయ్యాయని, వాటి కారణంగానే ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడని, అనంతరం మరణించాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని తెలిపారు. కురువ వీరేష్ మృతికి కారకులైన గ్రామ సర్పంచ్ ముష్టి విజయ్, ధరూర్ పోలీసుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. వీరేష్ కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని వారికి టీఆర్ఎస్ పార్టీ అండగా నిలబడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం మృతదేహాన్ని బూరెడ్డిపల్లికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.



## జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై విచారణ జరపాలి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్16(ప్రభాత ఉదయం):**

పత్రికలో వార్తా కథనాలు ప్రచురించిన జర్నలిస్టులను అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్‌రావు డిమాండ్ చేశారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు సంపత్, ఎడిటర్ శేఖర్‌లను శుక్రవారం పరామర్శించి, ఘటన వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ.. గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ వ్యవహారశైలిపై వరుస కథనాలు ప్రచురించినందుకు జర్నలిస్టులపై ప్రతీకార చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం, పోలీసుల అదుపులో చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలు రావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ ఘటనపై సిరిసిల్ల జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. గంభీరావుపేట ఎస్ఐతో పాటు బాధ్యులైన పోలీసులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల జర్నలిస్టులకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు నరేష్, శంకర్, సురేష్ తదితరులు ఉన్నారు



## కార్మికులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్16(ప్రభాత ఉదయం):**

సింగరేణి కార్మికుల సంక్షేమం, అభివృద్ధి విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలపై స్పందించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, రామగుండం ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఒకప్పుడు సింగరేణి కార్మికుల హక్కులు, తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడిన నాయకులు అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. కేటీఆర్ రామగుండం పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తీవ్రంగా ఖండించారు. ఈ విలేకరుల సమావేశంలో సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



## శ్రీ సరస్వతీ దేవి అవతారంలో కొలువుదీరిన అమ్మవారు

**అమ్మవారికి పూజలు నిర్వహించిన శ్రీరామ్ యూత్ అసోసియేషన్**

**దిల్ సుక్ నగర్, అక్టోబర్ 16(ప్రభాత ఉదయం)**

దిల్ సుక్ నగర్ పి అండ్ టి కాలనీ లో శ్రీరామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. శుక్రవారం ఆరవ రోజు సరస్వతి దేవి అవతారంలో కొలువుదీరిన అమ్మవారిని మహిళలు అభి, రిషిత, సహస్ర, సాత్విక, మురారి, శ్రేష్ట, ఆరాధ్య లు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



## గంగుల పోరాటంతో సాగునీరు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్16(ప్రభాత ఉదయం):**

సాగునీటి కోసం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన పోరాటం ఫలించడంతో రూరల్ మండలానికి నీరు చేరింది. దీంతో నగునూరు, ఇరుకుల్ల గ్రామాలకు చెందిన రైతులు, బిఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. డీ-86 కెనాల్ వద్ద నీటిలోకి దిగి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు, స్థానిక నాయకులు మాట్లాడుతూ.. పంటలు ఎండిపోయే దశలో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన గంగుల కమలాకర్ స్వయంగా చొప్పదండికి వెళ్లి రెగ్యులేటర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయించారని తెలిపారు. ఆయన చొరవతోనే రూరల్ మండలానికి సాగునీరు అందిందని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న గంగుల సేవలను మరువలేమని అన్నారు. సాగునీరు అందడంతో పంటలను కాపాడుకునే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలిచి సాగునీటి కోసం పోరాడిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో ఇరుకుల్ల సర్పంచ్ రమేష్ గౌడ్ తో పాటు బిఆర్ఎస్ నాయకులు రైతు నాయకులు మోహన్ రెడ్డి, వెంకటయ్య, సుమన్, మాజీ ఎంపిటిసి లు రామ్ రెడ్డి, భద్రయ్య, శ్రీనివాస్, రవితేజ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ కార్మికులకు నూతన వస్త్రాల బహుకరణ

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్16(ప్రభాత ఉదయం):**

బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని పారిశుధ్య కార్మికులకు 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన కుమార్ శ్రీదేవి దంపతులు నూతన వస్త్రాలను బహుకరించారు. ప్రతి సంవత్సరం పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేస్తున్న విధంగానే శుక్రవారం నూతన వస్త్రాలను బహుకరించారు. కార్మికులు చేస్తున్న సేవలను గుర్తించి పండగ సందర్భంగా వారు వారి కుటుంబ సభ్యులు కూడా సంతోషంగా ఉండాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు అంజని కుమార్ తెలిపారు.



## ప్రీమియర్ క్రికెట్ ట్రైనింగ్ అకాడమీ ప్రారంభం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్16(ప్రభాత ఉదయం):**

కరీంనగర్ నగర ప్రజలకు ప్రీమియర్ క్రికెట్ ట్రైనింగ్ అకాడమీ అందుబాటులోకి వచ్చింది. కట్టరాంపూర్ ప్రాంతంలో గిద్దె పెరుమాండ్లు గ్రౌండ్ వివేకానంద కాలనీ రోడ్ నెంబర్ 6 లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎం. ఎస్. డి దీన గ్లోరీ క్రికెట్ అకాడమీ నీ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాసం గణేష్, ఏపీపీ చంద్ర ( టింకు), సౌగాని కొమురయ్య, క్రికెట్ అకాడమీ కోచ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తకోటలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**ఉత్సవాలలో పాల్గొన్న రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు కల్వ సుజాత, ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులు**

**కొత్తకోట, అక్టోబర్ 16 (ప్రభాత ఉదయం)**



కొత్తకోట పట్టణ కేంద్రంలోని శ్రీ.శ్రీ.శ్రీ. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. అనంతరం దేవాలయ ఆవరణలో శ్రీ వాసవి ఏసీ కళ్యాణ మండప ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. తదనంతరం భవాని మాత దేవాలయంలో నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఎమ్మెల్యే దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా , మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608